సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025

గరిష్టం/కనిష్టం
31.6 /25.4
వాతావరణం
జిల్లాలో సోమవారం 25.4 - 31.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్.



సంక్షేమ చేవ్రాలు!

ఆయన సంతకం పేదోడి గుడిసెను పక్కా ఇల్లుగా మార్చింది..
గుండెకు పడ్డ చిల్లునూ పూడ్చింది.
ఆయన సంతకం విద్యార్థి తలరాతని మార్చింది. కొలువుల కలల్ని సాకారమూ చేసింది.
ఆయన సంతకం కరువు సీమలో నీళ్లై పారింది..
రైతన్న ఇంట పచ్చని పంటై మెరిసింది.. తీపి ఫలమై మురిసింది.
ఆ సంతకం సంక్షేమంతో ముడిపడింది.. అభివృద్ధికి తలపాగ చుట్టింది..
ఆ ఒక్క సంతకమే.. 'వైఎస్సార్'...
తెలుగు నేలపై.. నిండు వెలుగై ఉదయించిన వైఎస్సార్..
జనరంజక పాలనతో 'మహానేత'గా ఎదిగారు..
ప్రజల గుండెల్లో కొలువుండిపోయారు.

• వైఎస్ హయాంలో జిల్లాలో అభివృద్ధి పరుగులు • నేడు వైఎస్ వర్ధంతి

సాక్షి ప్రతినిధి, కడప : ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మరుక్షణం వైఎస్సార్ చేసిన సంతకం చరిత్రలో నిలిచిపోయింది. హామీ అంటే మాటిచ్చి మరిచిపోయేది కాదని రుజువు చేసిన సందర్భమది. 'ఎన్నికలకు ముందు నేను చేసిన వాగ్దానం ప్రకారం రైతులకు ఉచిత విద్యుత్‌ను అందించే కార్యక్రమానికి చెందిన ఫైలుపై తొలి సంతకం చేస్తున్నాను' అంటూ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర రెడ్డి చేసిన తొలిపలుకులు...తానేమిటో, తన విశ్వసనీయత ఏమిటో, చేసిన వాగ్దానాల పట్ల ఎంత నిబద్ధత ఉందో చెప్పకనే చెప్పాయి. ఆ క్షణం నుంచి సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లుగా ఆయన పాలన సాగింది. కాగా, తండ్రి అడుగుజాడల్లో నడిచిన వైఎస్ జగన్ మరో అడుగు ముందుకేసి తన ఐదేళ్ల పాలనలో జిల్లా అభివృద్ధిని పరుగులు పెట్టించారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి విలువ లు, విశ్వసనీయతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.

జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు

తెలుగు గడ్డపై ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి జనరంజక పాలన సాగించిన వైఎస్సార్ 2009 సెప్టెంబరు 2న హెలికాప్టర్ ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. వైఎస్ ఈ లోకాన్ని వీడి నేటితో 16 సంవత్సరాలు. అయినా జిల్లా వాసులు ఆయనను మరువలేకున్నారు. మదిలో మందిరం కట్టుకుని ఆయనను పూజిస్తున్నారు. వైఎస్ వర్ధంతి సందర్భంగా జిల్లాలో వైఎస్ విగ్రహాలకు పాలాభిషేకాలు నిర్వహించడంతోపాటు రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలతోపాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు.


రిమ్స్ దంత వైద్య కళాశాల


పులివెందులలోని ఐజీ కార్ల్


ట్రిపుల్ ఐటీ

అభివృద్ధికి చిరునామా

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సొంత జిల్లా కడపలో అభివృద్ధి పరుగులు పెట్టింది. సంక్షేమం వెల్లువలా సాగింది. అప్పటివరకు పాలకుల విపక్షతతో నలిగిపోయి.. అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయిన ఈ జిల్లా ఐదేళ్ల వైఎస్ పాలన కాలంలో సమగ్రాభివృద్ధి సాధించింది. మున్సిపాలిటీగా ఉన్న కడపను కార్పొరేషన్‌గా, రాయచోటి, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేలు, రాజంపేట మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చారు. జిల్లాలో యోగి వేమన యూనివర్శిటీ, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, పశువైద్య విద్య కళాశాలను నెలకొల్పారు. జిల్లా కేంద్రంలో రిమ్స్ వైద్య కళాశాల, 750 పడకల రిమ్స్ ఆస్పత్రి, దంత వైద్య విద్య కళాశాల నిర్మించారు. ట్రిపుల్ ఐటీ, ఐజీ కార్ల్ (పశు పరిశోధన కేంద్రం), దాల్మియా,భారతి సిమెంటు కర్మాగారాలు, గోవిందరాజా స్పిన్నింగ్ మిల్స్ తదితర పరిశ్రమలను నెలకొల్పారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను పరుగులు పెట్టించారు.

▸▸ ఓటమి ఎరుగని ధీరుడు...

దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఓటమి ఎరుగని ధీరుడుగా చరిత్రకెక్కాడు. విశ్వసనీయతే ప్రామాణికంగా రాజకీయాలు కొనసాగించారు. మాట ఇస్తే ఎంత కష్టమైనా నెరవేర్చాలని తపించేవారని విమర్శకులు సైతం కొనియాడుతుంటారు. మెడిసిన్ పూర్తి కాగానే జమ్మలమడుగు క్యాంబెల్ ఆసుపత్రిలో వైద్యునిగా ఏడాది కాలం సేవలందించారు. ఆ తర్వాత పులివెందులలో తన తండ్రి వైఎస్ రాజారెడ్డి పేరున 30 పడకల ఆస్పత్రిని నిర్మించి పేదలకు వైద్య సేవలు అందించారు. పేదల డాక్టర్‌గా, రూ.2 వైద్యుడిగా గుర్తింపు పొందారు. 1978లో తొలిసారిగా పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన ఆయన అప్పటి నుంచి 2009 వరకు ప్రతిసారి ఎన్నికల్లో గెలుస్తూ....ఓటమెరుగని ధీరుడిగా ఘనతకెక్కారు. రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగాను, మరో రెండు పర్యాయాలు పీసీసీ అధ్యక్షుడిగా, మూడు పర్యాయాలు సీఎల్పీ నేతగా, నాలుగు పర్యాయాలు పార్లమెంటు సభ్యుడిగా, ఆరు సార్లు ఎమ్మెల్యేగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పదవులను అలంకరించారు.

కరువు సీమలో నీళ్ల పరుగు

జలయజ్ఞంలో భాగంగా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. గాలేరు-నగరి సుజల స్రవంతి, గండికోట కెనాల్, టన్నెల్, గండికోట వరద కాల్వ, గండికోట ఎత్తిపోతల పథకాలు వైఎస్సార్ హయాంలో రూపొందినవే. మైలవరం ఆధునికీకరణ, సర్వరాయసాగర్, వామికొండ ప్రాజెక్టు, సీబీఆర్, పీబీసీ, పైడిపాలెం, వెలిగల్లు, తెలుగుగంగ ప్రాజెక్టు పనులు చకచకా సాగించారు. అధికారంలోకి వచ్చిన మరుసటి ఏడాదే తెలుగుగంగ పనులను పూర్తి చేసి కృష్ణా జిల్లాలతో బ్రహ్మంసాగర్‌ను నింపి ఆయకట్టుకు సోనియాగాంధీ చేతుల మీదుగా నీటిని విడుదల చేయించారు.నీళ్లు లేక బోసిపోయే కరువు సీమలో నీళ్లు పారించారు. సీమను సస్యశ్యామలంగా మార్చారు. ఎవరు ఏది అడిగినా కాదనకుండా పనిచేసిన నేత వైఎస్సార్. జిల్లాలో విశాలమైన రోడ్లు వేయించారు. జిల్లాలోని ఐదేళ్ల పాలన కాలంలో వేల కోట్ల నిధులు కుమ్మరించి అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత ఒక్క మహానేతకే దక్కింది.


జెడ్పీ వద్దగల హై లెవెల్ బ్రిడ్జిలు


కడపలోని వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియం


బ్రహ్మంసాగర్ జలాశయం


గండికోట జలాశయం

ప్రజలకు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



మంచిరోజులొస్తాయి

• ప్రజలు, కార్యకర్తల్లో భరోసా నింపిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్
• తొలి రోజు ప్రజలతో మమేకం

పులివెందుల : కూటమి ప్రభుత్వంలో అబద్ధాలకు, మోసాలకు అంతు లేకుండా పోయిందని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. కార్యకర్తలు, ప్రజలు అధైర్యపడాల్సిన అవసరం లేదని.. త్వరలోనే మంచి రోజులు వస్తాయని ఆయన వారికి భరోసా కల్పించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాకు చేరుకున్న ఆయనకు ఘన స్వాగతం లభించింది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో తన సతీమణి వైఎస్ భారతిరెడ్డితో కలిసి వైఎస్ జగన్ పులివెందులలోని తన నివాసానికి చేరుకున్నారు. అనంతరం వైఎస్ జగన్ భాకరాపురంలోని తన క్యాంపు కార్యాలయానికి చేరుకుని ప్రజలతో మమేకమయ్యారు. కూటమి ప్రభుత్వంలో తాము పడుతున్న కష్టాలను ప్రజలు వివరించగా ఓపిగ్గా విన్నారు. అధినేతను కలిసినవారిలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీలు రామ సుబ్బారెడ్డి, రమేష్ యాదవ్, రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, అంజాద్ బాషా, శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసు లు, సుధీర్‌రెడ్డి, గంగుల భాను, కడప మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, చెవిరెడ్డి కుమారుడు హర్షిత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజనేయ రెడ్డి, పూల శ్రీనివాసులరెడ్డి, మాజీ ఆప్కాస్ చైర్మన్ రూన్సీరాణి, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాల సుబ్రమణ్యం, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్ ఉన్నారు.

పింఛన్ల తొలగించారంటూ మహిళల ఆవేదన

పులివెందుల పట్టణం నగరిగుట్ట ప్రాంతానికి చెందిన రాజకుళ్లాయమ్మ అనే మహిళ తన పింఛన్ తీసేశారంటూ వైఎస్ జగన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన పింఛన్‌ను తొలగిస్తున్నట్లు నోటీసు ఇచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు. అలాగే పులివెందుల మండలం కనంపల్లెకు చెందిన కృపావతి అనే వితంతువు కూడా తన పింఛన్ తొలగించారని వాపోయింది. దీనికి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్పందిస్తూ చంద్రబాబు ప్రభుత్వం దాదాపు 4లక్షల పింఛన్లు తొలగించారని మండిపడ్డారు. అధైర్యపడొద్దని, పింఛన్ల విషయంలో న్యాయ పోరాటం చేద్దామని వారికి భరోసా కల్పించి అందుకు సంబంధించిన వివరాలు తెలుసుకోవాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సూచించారు.




భాకరాపురం క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యలు ఆలకిస్తున్న జననేత వైఎస్ జగన్

మాజీ ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ జగన్

పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పులివెందులలోని తన నివాసంలో కలిసిన ఆయన్ను శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు కేక్ తినిపించారు.

ఆటోగ్రాఫ్... ప్రకాశం జిల్లా దర్శికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డిని వైఎస్ జగన్ అభినందించారు. ఇటీవల కశ్మీర్ ప్రాంతంలోని లడాక్ ట్రిప్‌కి వెళ్లిన చంద్రశేఖర్ రెడ్డి భూమికి దాదాపు 18వేల అడుగుల ఎత్తైన ప్రాంతాన్ని చేరుకుని వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా అప్పటి ఫొటోలను వైఎస్ జగన్‌కి చూపించగా.. ఆయన అభినందించి జెండాపై ఆటోగ్రాఫ్ చేశారు.

నేడు ఇడుపులపాయలో వైఎస్సార్‌కు నివాళి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఇడుపులపాయలోని వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఉదయం 7.15గంటలకు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుంటారు. అక్క డ వైఎస్సార్‌కు నివాళులర్పించడంతోపాటు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. అనంతరం రోడ్డు మార్గాన బయలుదేరి 10.30 గంటలకు లింగాల మండలం అంబకపల్లె గ్రామానికి చేరుకుంటారు. అక్కడ గంగమ్మ కుంట చెరువు వద్ద నీటికి జలహారతి ఇవ్వనున్నారు. అక్కడినుంచి తిరిగి 12.30గంటలకు పులివెందులలోని తన నివాసానికి చేరుకుంటారు. అనంతరం 2.30 గంటల నుంచి 7.25గంటలవరకు భాకరాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజలతో ఆయన మమేకం కానున్నారు.


అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు

5న జష్నే-మిలాద్ ఉన్ నబీ


కడప సెవెన్‌రోడ్స్: ఈనెల 5న జష్నే మిలాదున్నబీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ మర్కజీ మిలాదున్నబీ జులూస్ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి నగరంలో జులూస్ (ర్యాలీ) నిర్వహించనున్నారని వివరించారు.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం


సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్
చివరి తేదీ
సెప్టెంబర్ 10, 2025

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.



సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.



సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు | రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలను స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు జేసీ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువు లోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. ఎవరైనా అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అరవై రోజుల విస్తృత ప్రచారం కల్పించాలని పోస్టర్లను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఎస్డీసి వెంకటపతి,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

6న 5కే రెడ్ రన్ మారథాన్

కడప రూరల్ : ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు ఈనెల 6వ తేదిన 5కే రెడ్ రన్ మారథాన్ నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో డీఎంహెచ్ఓ మాట్లాడారు. 6వ తేదిన ఉదయం 5.30 గంటలకు స్థానిక మహావీర్ సర్కిల్ కొత్త కలెక్టరేట్ రోడ్డు నుంచి రిమ్స్ బ్రిడ్జి వరకు, అక్కడి నుంచి యూ టర్న్ తీసుకుని మహావీర్ సర్కిల్ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ పరుగు పోటీల్లో అన్నిప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న 17 నుంచి 25 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు వేర్వేరుగా మొదటి బహుమతిగా రూ. 10 వేలు, రెండవ బహుమతిగా రూ. 7 వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు డాక్టర్ ఎస్.వెంకటరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ (సెల్ నెం. 9866094531), జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ (సెల్ నెం . 9989441014)ను సంప్రదించాలన్నారు.

చంద్రప్రభ వాహనంపై శ్రీరంగనాథుడు



పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలోని అతి పురాతనమైన శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాల్లో భాగంగా 5వ రోజు శ్రీరంగనాథుడు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఉభయదారులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. నూలుపూజ పవిత్రోత్సవాలను ప్రతి ఏడాది వినాయక చవితి మరుసటి రోజు నుంచి 9రోజుల పాటు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ నూలుపూజలకు భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మెన్ చింతకుంట సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణ పర్యవేక్షించారు.

క్లుప్తంగా

వ్యక్తిపై దాడి.. తీవ్ర గాయాలు



దాడిలో తీవ్రంగా గాయపడిన కృష్ణయ్య యాదవ్

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం పాత మార్కెట్‌లో కృష్ణయ్య యాదవ్ అనే వ్యక్తిపై నాగరాజు అనే వ్యక్తి దాడి చేశాడు. ఈ దాడిలో కృష్ణయ్య యాదవ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల మండలం బోనాల గ్రామానికి చెందిన కృష్ణయ్య యాదవ్ పని నిమిత్తం పులివెందులకు వచ్చాడు. పులివెందుల పట్టణం నగరిగుట్టలో నివాసముంటున్న నాగరాజు అనే వ్యక్తిని గతంలో బొలెరో వాహనంతో ఢీకొట్టడంతో అప్పట్లో నాగరాజుకు కాలు విరిగింది. ఇది మనసులో పెట్టుకొని సోమవారం మధ్యాహ్నం పాత మార్కెట్‌లోని కాంప్లెక్స్‌లో ఉన్న కృష్ణయ్య యాదవ్‌పై నాగరాజు దాడి చేశాడు. దీంతో కృష్ణయ్య యాదవ్‌కు తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విష్ణునారాయణ తెలిపారు.

జేవీవీ నూతన కమిటీ ఎన్నిక



జేవీవీ నూతన కార్యవర్గ సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : జన విజ్ఞాన వేదిక కడప జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ తెలిపారు. స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లోని జేవీవీ కార్యాలయంలో జరిగిన మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవదత్తం ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడిగా షామీర్ బాషా, ప్రధాన కార్యదర్శిగా శివరాం, సమత కన్వీనర్‌గా రామసుబ్బమ్మ, ఉపాధ్యక్షులుగా బాలబయన్న, దేవదత్తం, వెంకటసుబ్బయ్య, వెంకటరామరాజు, రవూఫ్ బాషా, పి.మహేష్, కార్యదర్శులుగా రాజేష్, నరసింహారెడ్డి, ప్రసన్న కుమార్, డేవిడ్ రాజ్, ఖాసీంవలి, కిరణ్‌కుమార్‌లను ఎన్నుకున్నట్లు వివరించారు. గౌరవాధ్యక్షులుగా ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ రాజా వెంగళరెడ్డి, రఘునాథరెడ్డి, గౌరవ సలహాదారులుగా కుమారస్వామి రెడ్డి, రామచంద్రారెడ్డి, గోపినాథ్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డిలతోపాటు కార్యవర్గ సభ్యులుగా పదిమందిని, విద్య, ఆరోగ్యం, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ, యూత్, సాహిత్యం, సాంస్కృతిక సబ్ కమిటీ కన్వీనర్, కోకన్వీనర్లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విద్య, ఆరోగ్యం, పర్యావరణంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పోలీసులతో వాగ్వాదం.. కేసు నమోదు

కడప అర్బన్: కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొండాయపల్లి వద్ద గణేశుని విగ్రహాన్ని నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకుని వెళుతున్న క్రమంలో ఆదివారం రాత్రి మల్లికార్జున రెడ్డితో పాటు, మరో నలుగురు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడప గడపలో కృష్ణమ్మ సవ్వడులు!

- సాగునీటి ప్రాజెక్టులకు ప్రాణం పోసిన దివంగత సీఎం వైఎస్సార్
- మెట్ట ప్రాంతాల్లో కృష్ణా జలాలు పారిస్తే నా జన్మ ధన్యమని నాడే స్పష్టీకరణ
- ప్రచార ఆర్భాటాలకే పరిమితమైన టీడీపీ ప్రభుత్వం
- అంబకపల్లె చెరువుకు చేరిన కృష్ణమ్మ



మాజీ సీఎం వైఎస్ జగన్ అంబకపల్లె చెరువు వద్ద జలహారతులు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లు

సాక్షి ప్రతినిధి కడప : 'బిర బిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను...బంగారు పంటలే పండుతాయి. ముత్యాల మురిపాలు దొరలుతాయి'.. ఇది శంకరంబాడి సుందరాచార్యులు రాసిన గేయం. ఇది ఒకనాటికి నిజమవుతుందని జిల్లా ప్రజలెవరూ ఊహించలేదు. మెట్ట ప్రాంతంలో కృష్ణా జలాలు పారిస్తే నా జన్మ ధన్యమని రాజోలి రిజర్వాయర్ శంకుస్థాపన సందర్భంగా ఆనాడే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్పష్టంగా చెప్పారు. ఆ మహానేత నిర్వహించ తలపెట్టిన జలయజ్ఞం ఫలితం సాకారమైంది. నీళ్లులేక నోళ్లు తెరచిన పులివెందుల నియోజకవర్గ బీడు భూములు పులకిస్తున్నాయి.

'తండ్రి బావి తవ్విస్తే కుమారుడు పూడ్చేశాడన్నట్లుగా' రాయలసీమ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 1988లో గాలేరు–నగరి, ఆ తర్వాత హంద్రీ–నీవా, వెలిగొండ ప్రాజెక్టులను ప్రకటించి శంకుస్థాపన చేశారని నాటి రాయలసీమ ఉద్యమకారులు వివరిస్తున్నారు. ఆ తర్వాత అనూహ్యంగా అధికారిక పగ్గాలు చేజిక్కించుకున్న చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఓ మాట.. తర్వాత మరోమాట చెబుతూ ప్రాజెక్టు నిర్మాణాన్ని గాలికొదిలేశారు. ఆ విషయాన్ని చరిత్ర స్పష్టం చేస్తోంది. 1996 పార్లమెంటు ఎన్నికల ముందు ఓట్ల కోసం గండికోట ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఆపై నిర్మాణాన్ని విస్మరించారు. మళ్లీ ఎన్నికల్లో ప్రజలకు చెప్పుకోవాలి కనుక 1999 సాధారణ ఎన్నికలకు ముందుగా 1998లో వామికొండ వద్ద మరోమారు శంకుస్థాపన చేశారు. గద్దెనెక్కిన తర్వాత మళ్లీ విస్మరించారు. కృష్ణస్వామి కమిటీ వేసి జీఎన్ఎస్ఎస్‌కు గండికొట్టే ప్రయత్నాలు చేశారని విశ్లేషకులు వివరిస్తున్నారు. తన తొమ్మిదేళ్ల పాలనలో ఈ ప్రాజెక్టుకు ఆయన ఖర్చు చేసింది కేవలం రూ.67.50 కోట్లు మాత్రమే. అది కూడా సిబ్బంది జీతభత్యాలకు మాత్రమే. ప్రాజెక్టు పనులు ఒక్క అడుగు ముందుకు సాగలేదు. అధికారిక గణాంకాల ద్వారా ఈ విషయం తేటతెల్లమవుతోంది. పైగా రాయలసీమ సాగు, తాగునీరు అందాలంటే శ్రీశైలం ప్రాజెక్టులో 854 అడుగుల కనీస నీటిమట్టాన్ని ఉంచాలి. కాగా చంద్రబాబు సర్కార్ జీఓ నెంబర్ 69 జారీ చేసి శ్రీశైలం ప్రాజెక్టులో కనీస నీటిమట్టం 834 అడుగులకు కుదించడం ద్వారా రాయలసీమ మరణ శాసనాన్ని లిఖించారని పలువురు విమర్శిస్తున్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు ప్రాణం పోసిన వైఎస్..

2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు వైఎస్ రాజశేఖరరెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కేవలం ఐదేళ్ల కాలంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం జిల్లాలో దాదాపు రూ.12వేల కోట్లు వెచ్చించారు. మొదటి దశలో భాగమైన అవుకు నుంచి గండికోటకు వరదకాలువ, గండికోట రిజర్వాయర్, టన్నెల్, వామికొండ, సర్వరాయసాగర్ పనులు సుమారు 85 శాతం పూర్తి చేశారు. అవుకు రిజర్వాయర్ కాంప్లెక్స్ సామర్థ్యాన్ని 4.8 టీఎంసీలకు పెంపు, గోరకల్లు నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి చేశారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాజెక్టుల భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు విస్తరింపజేశారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యం పెంపులో తెలంగాణ ప్రాంతం తెలుగుదేశం, టీఆర్ఎస్, కోస్తా ప్రాంతం టీడీపీ నాయకులు సంయుక్తంగా జతకట్టి ఆరోపణలు గుప్పించారు. జలయజ్ఞం ప్రాజెక్టుల నిర్మాణపు పనులు దృష్టిలో ఉంచుకొని నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అఖిలపక్ష సమావేశం నిర్వహించి, ఆరోపణలు గుప్పించిన నాయకుల అందరి నోర్లు మూయించి, ఒప్పించి, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ విస్తరణ సామర్థ్యం పెంచారని చరిత్రకారులు వివరిస్తున్నారు. జీఎన్ఎస్ఎస్ పథకంలో తొలుత గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం లేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పులివెందుల నియోజకవర్గానికి తాగు, సాగునీరు ఇవ్వాలన్న ఉద్దేశంతో ఆ పథకానికి రూపకల్పన చేశారు. పైడిపాలెం వద్ద 6 టీఎంసీల సామర్థ్యంతో రూ.727 కోట్లు అంచనా వ్యయంతో పైడిపాళెం రిజర్వాయర్ ఏర్పాటు చేశారు. తద్వారా తొండూరు, సింహాద్రిపురం, కొండాపురం మండలాల్లోని చెరువులను నింపి 47,500 ఎకరాలకు కొత్తగా సాగునీరుతో పాటు, పీబీసీ కింద 41,000 ఎకరాలు ఆయకట్టు స్థిరీకరణతో పలు గ్రామాలకు తాగునీరు అందించాలనే సంకల్పం పుచ్చుకున్నారు.

వైఎస్ కుటుంబం కృషి ఫలితమే..

తుంగభద్ర హైలెవెల్ కెనాల్‌లో అంతర్భాగంగా గతంలో పులివెందుల బ్రాంచ్‌కెనాల్ నిర్మించారు. టీబీ డ్యాంలో పూడిక పేరుకుపోవడం, ఎగువప్రాంతాల నీటి అక్రమ వినియోగం వంటి కారణాల వల్ల పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు ఏనాడు పూర్తి సామర్థ్యంతో సాగునీరు అందలేదు. రైతులు అనేక ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆయకట్టు స్థిరీకరణ కోసం చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించారు. అయినా ఆశించిన ఫలితం కన్పించలేదు. ఈ నేపథ్యంలో సీబీఆర్‌కు గండికోట నుంచి 8.3 టీఎంసీల నీటిని 5 లిఫ్టుల ద్వారా తీసుకెళ్లే బృహత్తర పథకానికి కూడా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారు. రూ.1343 కోట్లు అంచనా వ్యయంతో చేపట్టగా, అందులో రూ.1090కోట్లు దివంగత సీఎం వైఎస్సార్ ఖర్చు చేశారు. నాటి కృషి ఫలితమే నేడు అంబకపల్లెకు కృష్ణా జలాలు వచ్చి చేరాయి. పాడా నిధుల ద్వారా అంబకపల్లె గంగమ్మ కుంటకు రూ.1.4 కోట్లతో 14 ఎకరాల భూసేకరణ చేపట్టి కొత్త చెరువును నిర్మించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎంపీ నిధులతో రూ.2.50 కోట్లు వెచ్చించి హిరోజ్‌పురం గ్రామం వద్ద భారీ సంప్‌ను ఏర్పాటు చేసి 4.5 కి.మీ మేర అంబకపల్లె చెరువుకు పైపులైన్ ఏర్పాటు చేశారు. ఫలితంగా అంబకపల్లె చెరువుకు కృష్ణా నీరు వచ్చి చేరింది. మంగళవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబకపల్లె చెరువు వద్ద జలహారతి ఇవ్వనున్నారు.

ఇడుపులపాయకు చేరుకున్న వైఎస్ విజయమ్మ, షర్మిల

వేంపల్లె : నేడు మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ, కుమార్తె పీసీసీ చీఫ్ షర్మిల మంగళవారం ఆయన సమాధి వద్ద నివాళులర్పించనున్నారు. సోమవారం సాయంత్రం వీరు ఇడుపులపాయకు కుటుంబ సభ్యులతో కలిసి చేరుకున్నారు. ఉదయం 8 గంటలకు షర్మిల వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పిస్తారు.

ఇందిరమ్మ కాలనీలో విషాద ఛాయలు



సురేష్ కుమార్(ఫైల్)

మైదుకూరు : కాలనీలో కొలువుదీర్చిన వినాయకుని ప్రతిమను ఆనందోత్సాహాలతో నిమజ్జనం చేసేందుకు వెళుతూ నొస్సం సురేష్ కుమార్ ఆచారి అనే యువకుడు మృతి చెందడంతో పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆదివారం రాత్రి చాపాడు మండలం అల్లాడుపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సురేష్ కుమార్ మృతి చెందిన విషయం తెలిసిందే. అల్లాడుపల్లె వద్ద ప్రొద్దుటూరు వైపు వెళుతున్న ఓ లారీ వెనుక వైపు నుంచి వినాయకుని విగ్రహంతో వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ట్రాక్టర్‌లో ముందువైపు ఇంజన్‌పై కూర్చుని ఉన్న సురేష్ కుమార్ ఎగిరి కిందపడ్డాడు. అతనిపై లారీ దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. మృతునికి భార్య మంజులత, ఇద్దరు కుమారులు ఉన్నారు. సురేష్‌కుమార్ వడ్రంగి పనిలో మంచి నైపుణ్యం ఉన్న కళాకారుడని, అతని మృతి కుటుంబానికి తీరని లోటని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

డ్రాగా ముగిసిన ఏసీఏ అండర్–23 మ్యాచ్‌లు



66 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ ఆదిల్ హుస్సేన్



174 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ నాగ చాతుర్య



62 పరుగులు చేసిన కర్నూలు బ్యాట్స్‌మన్ సాయి సూర్య తేజరెడ్డి



81 పరుగులు చేసిన కర్నూలు బ్యాట్స్‌మన్ నయిముల్లా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–23 మల్టీ డే మ్యాచ్‌లు మూడో రోజు డ్రాగా ముగిశాయి. కడప–చిత్తూరు జట్ల మధ్య కేఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో 99 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన కడప జట్టు 117.4 ఓవర్లలో 406 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని నాగ చైతుర్య 339 బంతుల్లో 25 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 174 పరుగులు చేసి ఆడాడు. షేక్ ఆదిల్ హుస్సేన్ 66 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని ముకేష్ 3 వికెట్లు, రెడ్డి ప్రకాశ్ 3 వికెట్లు, బ్రహ్మ తేజ్ రెడ్డి 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు ఆధిక్యం సాధించింది.

భారీ ఆధిక్యం సాధించిన నెల్లూరు జట్టు

వైఎస్ఆర్ఆర్ స్టేడియంలో నెల్లూరు–కర్నూలు జట్ల మధ్య సోమవారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌లో 54 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన నెల్లూరు జట్టు 34.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసింది. ఆ జట్టులోని పవన్ రిత్విక్ 51 పరుగులు, నిఖిలేశ్వర్ 30 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని సాయి సూర్య తేజ రెడ్డి 2 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 63 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసింది. ఆ జట్టులోని నయిముల్లా 81 పరుగులు, సాయి సూర్యతేజ రెడ్డి 62 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని అఖిల్ 3 వికెట్లు, మాధవ్ 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. నెల్లూరు తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత సాధించింది.

ప్రజా ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ముఖాముఖి మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించే ఫిర్యాదులు పునరావృతం కాకుండా ఆయా ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం'(పి.జి.ఆర్.ఎస్) నిర్వహించారు. 113 మంది ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదుల గురించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

2 కిలోల గంజాయి స్వాధీనం

ముద్దనూరు : ముద్దనూరు–కడప రహదారిలో ఓ డాబా వద్ద సోమవారం గణపత్ దావర్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ దస్తగిరి తెలిపారు. నిందితుడు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సర్వాలి గ్రామానికి చెందిన గణపత్ అని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



పూర్తిగా కాలిపోయిన ఫ్రిజ్

అట్లూరు : అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైన సంఘటన అట్లూరు మండలం రెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల, బాధితుల కథనం మేరకు రెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో జవ్వాజి సావిత్రి, సుబ్బరాయుడు దంపతులు ఆదివారం రాత్రి ఇంటి ముందు నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఇంటిలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో కాలనీవాసులు ఉలిక్కిపడ్డారు. వెంటనే విద్యుత్తు వైర్లు తొలగించి మంటలను అదుపు చేసే లోపే ఇంట్లోని వైరింగ్‌తో పాటు ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, బీరువాలోని రూ.20 వేలు నగదు, దుస్తులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు లక్షా యాభై వేల రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

బాకీ డబ్బు అడిగినందుకు దళిత యువకుడి హత్య



ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో జేష్టాది దివాకర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

దువ్వూరు : బాకీ ఇచ్చిన డబ్బును తిరిగి చెల్లించమని అడిగినందుకు దళిత యువకుడు హత్యకు గురైన సంఘటన దువ్వూరు మండలం భీమునిపాడు ఎస్సీ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. భీమునిపాడు ఎస్సీ కాలనీకి చెందిన జేష్టాది దివాకర్ (35), పక్క గ్రామం సంగటితిమ్మాయపల్లెకు చెందిన నాగ దస్తగిరి ఇరువురు స్నేహితులు. ఇద్దరు వ్యవసాయ పనులకు కూలీలుగా వెళ్లేవారు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం జేష్టాది దివాకర్ దగ్గర నాగదస్తగిరి రూ.10వేలు అప్పుగా తీసుకున్నాడు. ఆదివారం దివాకర్ తనకు డబ్బు చాలా అవసరం ఉందని అప్పుగా ఇచ్చిన రూ.10వేలు ఇవ్వాలని నాగదస్తగిరిని అడిగాడు. తన వద్ద డబ్బు లేదు.. ఏమి చేసుకుంటావో చేసుకో అని నాగదస్తగిరి అన్నాడు. ఈ క్రమంలో దివాకర్ అతని ఫోన్ తీసుకుని తీసుకున్న అప్పు చెల్లించి ఫోన్ తీసుకెళ్లు అని చెప్పి వెళ్లిపోయాడు. ఆదివారం సాయంత్రం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న దివాకర్ ఇంటి వద్దకు నాగదస్తగిరి వెళ్లి డబ్బు ఇస్తాను రా మాట్లాడుదాం అని పిలుచుకెళ్లాడు. ఎస్సీ కాలనీలోని వాటర్ ట్యాంక్ వద్దకు రాగానే డబ్బు ఇవ్వలేదని తన సెల్‌ఫోన్ తీసుకెళతావా అని దివాకర్ తలపై బండరాయితో నాగదస్తగిరి గట్టిగా కొట్టాడు. తీవ్ర గాయాలతో దివాకర్ అక్కడే పడిపోయాడు. విషయం తెలుసుకున్న బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన దివాకర్‌ను ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రిలో దివాకర్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు దివాకర్‌కు భార్య మహాలక్ష్మమ్మ, కుమారుడు సుదీప్(12) ఉన్నారు. కుటుంబాన్ని పోషించే కొడుకు హత్యకు గురికావడంతో తల్లిదండ్రులు, భార్యా పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై మృతుడి తల్లి జేష్టాది మరియమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్య కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు దువ్వూరు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. గత నెల 26న మదిరేపల్లె గ్రామంలో బాకీ చెల్లించలేదని దళిత యువకుడు పాలగిరి చెన్నయ్యను హత్య చేసిన సంఘటన మరువక ముందే మండలంలో మరో దళిత యువకుడు హత్యకు గురికావడం చర్చనీయాంశంగా మారింది.

స్థల వివాదంలో ఇరు వర్గాల ఘర్షణ





గాయపడిన నాగేంద్ర, రామచంద్ర

కమలాపురం : కమలాపురం పట్టణ పరిధిలోని అక్కంపేట గ్రామానికి చెందిన పాణ్యం నాగేంద్ర, గాలింకి రామచంద్రల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరికి రక్త గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అక్కంపేట ఎస్సీ కాలనీలో నాగేంద్ర స్థలానికి ఆనుకుని రామచంద్రకు స్థలం ఉంది. ఈ స్థలం గురించి ఇద్దరి మధ్య గతంలోనే మనస్పర్థలున్నాయి. సోమవారం రామచంద్ర తన స్థలంతో పాటు నాగేంద్ర స్థలంలో కూడా కంప కట్టెలు వేయడంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తమ స్థలంలో కట్టెలు ఎందుకు వేశావని నాగేంద్ర ప్రశ్నించడంతో ఈ స్థలం కూడా మాదేనని రామచంద్ర చెప్పడంతో వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. వాగ్వాదానికి దిగడంతో పాటు కట్టెలతో కొట్టుకున్నారు. ఈ ఘటనలో నాగేంద్ర చేతులకు, రామచంద్ర తలకు రక్త గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిద్దరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి.. యువకులకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన శ్రీబాబు



చేయి విరిగిన నరసింహారెడ్డి

అట్లూరు : ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన అట్లూరు మండలం కడప–బద్వేలు ప్రధాన రహదారిపై రెడ్డిపల్లి వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు అట్లూరు మండల పరిధిలోని ఎస్.వెంకటాపురం ఉప్పుటూరు కాలనీకి చెందిన శ్రీబాబు, గోపినాథపురం గ్రామానికి చెందిన సానపురెడ్డి నరసింహారెడ్డి ఇద్దరు పుట్టుకతోనే మూగ, చెవిటి వారు. ఇద్దరూ కడపలో డిగ్రీ వరకు కలిసి చదువుకున్నారు. శ్రీబాబు ఓ ప్రైవేటు సీసీ కెమెరాల కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఇద్దరూ అట్లూరు వైపు ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఉన్నట్టుండి రెడ్డిపల్లి క్రాస్ రోడ్డు వద్ద గడ్డి మోపుతో మరో ద్విచక్రవాహనం అడ్డు రావడంతో దాన్ని తప్పించ బోయి అదుపుతప్పి కిందపడ్డారు. శ్రీబాబు తలకు తీవ్ర గాయాలు కాగా నరసింహారెడ్డికి చేయి విరిగింది. 108 వాహనం ద్వారా పోలీసులు వారిని ఆస్పత్రికి తరలించారు.

అదుపు తప్పి ముళ్ల పొదల్లోకి వెళ్లిన కారు



ముళ్లపొదల్లో కారు

సిద్దవటం : సిద్దవటం మండలం, కడప–చెన్నై జాతీయ రహదారి భాకరాపేట గ్రామ సమీపంలో సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. కడప నగరంలోని ఐటీఐ సర్కిల్‌కు చెందిన వెంకటరమణ, ఆయన భార్య ఈశ్వరమ్మ, కుమార్తె యామినితో కలిసి ఒక శుభ కార్యక్రమానికి హాజరయ్యేందుకు రేణిగుంటకు కారులో బయలుదేరారు. కారు సిద్దవటం మండలంలోని శనేశ్వరస్వామి ఆలయం దాటుకొని వస్తుండగా ఆవు అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి అదుపు తప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ఈశ్వరమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న సిద్దవటం ఎస్ఐ మహమ్మద్ రఫీ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు.

పెన్షన్ అందక టెన్షన్!

- వితంతువులకు షాక్ ఇచ్చిన ప్రభుత్వం
- ఎన్నికల కోడ్ కారణంగా జులై నెల పెన్షన్ నిలుపుదల
- ఆందోళనలో లబ్ధిదారులు

ఖాజీపేట : చనిపోయిన వ్యక్తి స్థానంలో వారి భార్యలకు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వం ఇవ్వలేదు. రెండు నెలల పెన్షన్ ఒకేసారి ఇస్తారనుకుంటే సెప్టెంబర్ నెలలో కేవలం ఒక్క నెల పెన్షన్ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. వివరాల్లోకి వెళితే..

ఖాజీపేట మండలంలో మొత్తం 7262 మంది లబ్ధిదారులు ఉన్నారు. అందులో అన్ని రకాల పెన్షన్లు కలిసి వీరికి నెలకు రూ.3 కోట్ల 08 లక్షల 99 వేల 500 డబ్బు వస్తోంది. మండల పరిధిలో ఏడాది లోపు వివిధ కారణాల వల్ల పెన్షన్ పొందుతున్న 128 మంది మరణించారు. వారి భార్యలకు ప్రభుత్వం జులై నెల నుంచి పెన్షన్ మంజూరు చేసింది.

నెల పెన్షన్ కట్..

మంజూరు చేసిన పెన్షన్ జులై నెల నుంచి తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వం డబ్బు కూడా మంజూరు చేసింది. అయితే వారికి పులివెందుల జెడ్పీటీసీ ఎన్నిక కారణంగా పెన్షన్ డబ్బు ఇవ్వలేదు. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోని వారికి కోడ్ వర్తిస్తుందని ఆపేశారు. అయితే కోడ్ ముగిసింది. రెండు నెలలు అంటే జులై, ఆగస్టు పెన్షన్ వారికి ఇవ్వాల్సి ఉంది. అయితే అధికారులు కేవలం ఆగస్టు నెలకు మాత్రమే ఇచ్చారు. జులై నెల పెన్షన్‌ను ఇవ్వలేదు. దీంతో రెండు నెలల పెన్షన్ బదులు ఒక్క నెల పెన్షన్ మాత్రమే తీసుకోవాల్సి వచ్చింది. ఇదేమని అధికారులను అడిగితే పై నుంచి మాకు ఉత్తర్వులు లేవు కనుక నెల పెన్షన్ మాత్రమే ఇస్తున్నాం అని లబ్ధిదారులకు తెలిపారు.

224 మంది దివ్యాంగులకు నోటీసులు..

ఖాజీపేట మండలంలో పెన్షన్ పొందుతున్న 224 మంది దివ్యాంగులకు నోటీసులు అందజేశారు. అందులో కొందరివి అక్రమ పెన్షన్‌లు కాగా అర్హత కల్గిన వారికి కూడా పెన్షన్ రాకుండా పోయింది. తమకు తీరని అన్యాయం జరిగిందని అర్హత కల్గిన లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

నెల పెన్షన్ మాత్రమే ఇచ్చారు..



నా భర్త చనిపోయిన కారణంగా నాకు పెన్షన్ మంజూరు చేశారు. జులై నుంచి పెన్షన్ వచ్చిందని అధికారులు చెప్పారు. అయితే కేవలం ఒక్క నెల పెన్షన్ మాత్రమే ఇచ్చారు. మరో నెల పెన్షన్ పెండింగ్‌లో పెట్టారు.

- సవరం దుర్గమ్మ, నాగపట్నం

ఎన్నికల కోడ్ ఉందన్నారు..



జులై నెలలో నాకు పెన్షన్ మంజూరైంది. డబ్బులు అడిగితే ఎన్నికల కోడ్ కారణంగా ఇవ్వలేమని అధికారులు చెప్పారు. రెండు నెలల పెన్షన్ ఇప్పుడు ఇస్తారనుకుంటే కేవలం ఒక్క నెల పెన్షన్ మాత్రమే ఇచ్చారు.

- కొర్లకుంట ఈరమ్మ, పత్తూరు బెస్తకాలనీ

రెండు నెలల పెన్షన్ ఇస్తారనుకున్నాం..



ఎన్నికల కోడ్ కారణంగా జులై నెల పెన్షన్ అధికారులు ఇవ్వలేదు. రెండు నెలల పెన్షన్ ఇస్తారని అనుకుంటే కేవలం ఒక్క నెల మాత్రమే ఇచ్చారు. రెండు నెలల పెన్షన్ ఇచ్చి ఉంటే బాగుండేది.

- తొర్రివేముల వెంకట లక్షుమ్మ, పత్తూరు